AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
18-2-2026 (Wednesday) MAIN EDITION

## ఇండియా ఏఐ సదస్సు పొడిగింపు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్ ఆతిథ్యమిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సును మరో రోజుకు పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సదస్సుకు భారీగా ప్రదర్శనకారులు, సందర్శకులు తరలివస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఢిల్లీలో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఫిబ్రవరి 16 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు మొదట కేంద్రం పేర్కొంది. కాగా దీనికి విపరీతమైన స్పందన వస్తుండడంతో 21వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపింది. ప్రజల సౌలభ్యం కోసం ఎక్స్‌పో సమయాన్ని సాయంత్రం 6 గంటలకు బదులుగా రాత్రి 8 గంటల వరకు పొడిగించామని పేర్కొంది.

## ఐపీవోకు ఐవీఎఫ్ సంస్థ





**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ, ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ చికిత్సలను అందించే గౌడియం ఐవీఎఫ్, ఉమెన్ హెల్త్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. శుక్రవారం నుంచి సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఐపీవో ద్వారా రూ. 165 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఫ్రెష్ ఇష్యూ కింద రూ. 5 ఫేస్ వ్యాల్యూ కలిగిన 1,13,92,500 షేర్లను విక్రయించడం ద్వారా రూ. 90 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ. 5 ఫేస్ వ్యాల్యూ కలిగిన 94,93,700 షేర్లను విక్రయించి రూ. 75 కోట్లు సమీకరించనుంది.

## ఏపీ శాసనమండలి రేపటికి వాయిదా



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో వాయిదాల పర్వం కొనసాగుతోంది. మండలిలో రెండోరోజు కూడా ఇందాపూర్ డెయిరీ అంశంపై గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సభను ఛైర్మన్ రేపటికి వాయిదా వేశారు.

## మోహన్‌బాబుకు కోర్టులో ఎదురుదెబ్బ



**అక్షరటుడే, ఏపీ:** విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసులో సినీనటుడు, మోహన్‌బాబు యూనివర్సిటీ ఛాన్సలర్ మోహన్‌బాబుకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని ఆయన చేసిన అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. ప్రధాన వ్యాజ్యంపై లోతైన విచారణ జరుపుతామన్న జడ్జి మార్చి 3కు వాయిదా వేశారు.

## యూఏఈపై సౌతాఫ్రికా విజయం



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** యూఏఈని సౌతాఫ్రికా మట్టికరిపించింది. తొలుత బ్యాటింగ్ చేసిన అరబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసింది. 123 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ప్రొటీస్ జట్టు 13.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. బ్రెవిస్ 36 పరుగులతో రాణించారు.

## పలు కోర్టులకు బాంబు బెదిరింపులు

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బుధవారం ఉదయం బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపింది. తెలంగాణలోని నాంపల్లి సీబీఐ కోర్టు, కరీంనగర్ జిల్లా కోర్టులకు బెదిరింపులు వచ్చాయి. అలాగే ఏపీలోని రాజమండ్రి జిల్లా కోర్టులో సైతం బాంబు పెట్టినట్లు ఫోన్ రావడంతో అధికారులు, పోలీసులు అప్రమత్తమయ్యారు. కరీంనగర్ కోర్టులో 12 ఆర్డీఎక్స్ బాంబులు అమర్చినట్లు గుర్తు తెలియని వ్యక్తులు మెయిల్ పంపించారు. దీంతో పోలీసులు కోర్టుకు చేరుకొని తనిఖీలు చేపట్టారు. మరో వైపు నాంపల్లి సీబీఐ కోర్టు, రాజమండ్రి జిల్లా కోర్టుకు సైతం బెదిరింపులు వచ్చాయి.

## బుర్కాలో యువకుడి హల్‌చల్..



**అక్షరటుడే, జగిత్యాల:** జగిత్యాల జిల్లా కోరుట్లలో ఓ యువకుడు బుర్కా వేసుకొని ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళల మధ్య కూర్చున్నాడు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బస్టాండ్‌లో మహిళ ప్రయాణికుల మధ్య బుర్కా వేసుకొని కూర్చుని ఫోన్ మాట్లాడుతున్న సమయంలో మగ గొంతు వినిపించడంతో మహిళలకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు యువకుడిని ప్రశ్నించగా.. రీల్స్ కోసం బుర్కా వేసుకున్నట్లు చెప్పడం గమనార్హం.

**మరో ఎన్నికకు నగారా మోగింది. దేశవ్యాప్తంగా ఖాళీ అవుతున్న రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం సిద్ధం అయింది. ఈ మేరకు బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. పది రాష్ట్రాల్లోని 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనుంది. ఈ నెల 26న నోటిఫికేషన్ వెలువడనుంది. మార్చి 16 పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ తెలిపింది.**

**—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**




# మోగిన నగారా

■ రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల ■ ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ ■ పది రాష్ట్రాల్లో 37 స్థానాలకు ఎన్నిక ■ తెలంగాణలో రెండు సీట్లకు..

రాజ్యసభలో ఖాళీ అవుతున్న సీట్ల కోసం షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం విడుదల చేసింది. పది రాష్ట్రాల్లో 37 రాజ్యసభ స్థానాలకు ఈ నెల 26 నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పేర్కొంది. 4 రాష్ట్రాల్లో ఏప్రిల్ 4న, 6 రాష్ట్రాల్లో 9న రాజ్యసభ ఎంపీల పదవీకాలం ముగియనుంది. దీంతో ఆయా స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. తెలంగాణలో సైతం రెండు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 16న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

### మహారాష్ట్రలో అత్యధికం

రాజ్యసభలో ప్రతి రెండేళ్లకోసారి కొంత మంది సభ్యుల పదవీకాలం ముగుస్తుంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 26న నోటిఫికేషన్ వెలువడ నుంది. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయొచ్చు. నామినేషన్ల పరిశీలన మార్చి 6న, ఉపసంహరణ గడువు 9 వరకు ఉంటుంది. మహా రాష్ట్రలో ఏడు, ఒడిశా నుంచి 3, తమిళనాడు, వెస్ట్‌బెంగాల్ నుంచి 5 చొప్పున సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అస్సాం 3, బీహార్ 4, ఛత్తీస్‌గఢ్ 2, తెలంగాణలో 2, హర్యానా 1, హిమాచల్‌లో ఒక సీటుకు ఎన్నికలు నిర్వహిస్తారు.

### తెలంగాణలో..

కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ సింఘ్వీ, బీఆర్ఎస్ నాయకుడు కేఆర్ సురేశ్‌రెడ్డి పదవీ కాలం ఏప్రిల్ 9న ముగియనుంది. దీంతో ఆయా స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కేఆర్ సురేశ్‌రెడ్డి 2020 ఏప్రిల్ 10 నుంచి, అభిషేక్ సింఘ్వీ 2024 ఆగస్టు నుంచి రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతున్నారు. ఈ సీట్లు ఎవరికి దక్కుతాయోనని ఉత్కంఠ నెలకొంది. రెండు సీట్లు కాంగ్రెస్ దక్కించుకుంటుందా.. లేక ఒకదానిని బీఆర్ఎస్ నిలబెట్టుకుందా చూడాలి. మరోసారి సింఘ్వీకి రాష్ట్రం నుంచి అవకాశం కల్పిస్తారా.. లేక తెలంగాణలోని నాయకులను ఎంపీ చేస్తారా అనే విషయాలు త్వరలో తెలియనున్నాయి.

## ఐఎన్‌ఎస్ సుమేధపై ప్రయాణించిన రాష్ట్రపతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐఎన్‌ఎస్ సుమేధ యుద్ధనౌకలో ప్రయాణించారు. ఏపీలోని విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) కొనసాగుతోంది. ఆరు వరుసలలో జరిగిన ఫ్లీట్ రివ్యూలో భారతీయ, విదేశీ మూలాలు కలిగిన 72 నౌకల సముదాయం పాల్గొంది. భారత నావికాదళం ఇప్పటివరకు దేశంలో నిర్వహించిన అతిపెద్ద అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో ఈ భారీ భాగస్వామ్యం సముద్ర దౌత్య స్ఫూర్తిని హైలైట్ చేసింది. రాష్ట్రపతి ప్రెసిడెన్షియల్ యాచ్‌ట్‌గా పనిచేస్తున్న INS సుమేధలో ఎక్కడానికి ముందు నేవీ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అక్కడి నుంచి ఆమె నౌకాదళాన్ని సమీక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు పాల్గొన్నారు.

## రూ.1.5 కోట్లకు భర్తను అమ్మేసిన భార్య!



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఓ మహిళ తన భర్తను అమ్మేసింది. రూ.1.5 కోట్లు తీసుకొని కట్టుకున్న వాడిని మరో మహిళకు అప్పగించింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సదరు మహిళ భర్తను తన స్నేహితురాలికి విక్రయించడం గమనార్హం. ఫ్యామిలీ కోర్టు సైతం దీనికి ఓకే చెప్పింది. భోపాల్‌లోని ఓ వ్యక్తికి (42) భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే అతడి భార్య స్నేహితురాలు, కొలిగ్ అయిన మహిళతో (54) అతడికి పరిచయమైంది. అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. దీంతో తన భర్త తీరుపై మహిళ కోర్టును ఆశ్రయించింది. భోపాల్ ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వివాదాన్ని పరిష్కరించడానికి కోర్టు దంపతులతో పాటు అతడు వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను సైతం కౌన్సెలింగ్ కోసం పిలిచింది. భర్త తన స్నేహితురాలితో తన సంబంధాన్ని కొనసాగించాలనుకుంటున్నట్లు బహిరంగంగా చెప్పాడు. దీంతో అతడి భార్య చట్టబద్ధంగా తన భర్తను వదులుకోవడానికి రూ.1.5 కోట్లు పరిహారం కోరింది. అంతమొత్తం ఇవ్వడానికి ఆమె స్నేహితురాలు ఒప్పుకుంది.

## పెళ్లి కూతురుపై నోట్ల వర్షం..




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పెళ్లి అంటే జీవితంలో మర్చిపోలేని వేడుక. ఈ వేడుకను ఘనంగా జరుపుకోడానికి జంటలు ప్రయత్నిస్తుంటాయి. ఈ క్రమంలో ఓ వరుడు తన కాబోయే భార్యపై నోట్ల వర్షం కురిపించాడు. పంజాబ్‌లో జరిగిన ఒక వివాహానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టార్న్ తరణ్ ప్రాంతంలో ఫిబ్రవరి 14న జరిగిన వివాహ వేడుకలో వధువుపై వరుడి కుటుంబ సభ్యులు భారీగా డబ్బులు వెదజల్లారు. పెళ్లి కూతురు వేదిక మధ్యలో నిలబడి ఉండగా.. వరుడితో పాటు అతడి కుటుంబ సభ్యులు ఆమెపై నోట్ల వర్షం కురిపించారు. పంజాబీ వివాహాలలో ఇది ఒక ఆచారం. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. అంతేగాకుండా రూ.8.5 కోట్లు వధువుపై చల్లారని ప్రచారం జరిగింది. ఆ ప్రచారాన్ని వరుడి కుటుంబ సభ్యులు ఖండించారు. తాము డబ్బు వర్షం కురిపించినా.. ఆ మొత్తం రూ.2 లక్షల వరకు ఉంటుందన్నారు. దానిని కోట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు.

## పవన్ కల్యాణ్ కాన్వాయ్‌కి ప్రమాదం



**అక్షరటుడే, ఏపీ:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. కాన్వాయ్‌లోని ఓ వాహనం డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో మిగతా వాహనాలు ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ ప్రస్తుతం విశాఖపట్నంలో పర్యటిస్తున్నారు. బుధవారం ఉదయం ఆయన కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. అయితే ఆ సమయంలో పవన్ కారులో లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. దెబ్బతిన్న వాహనాన్ని కాన్వాయ్‌లో నుంచి తొలగించారు. దాని స్థానంలో మరో కారును ఏర్పాటు చేశారు.

## పెళ్లి కూతురి గెటప్‌లో అనుపమా..



**హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ బర్త్‌డే సందర్భంగా ఆమె నటిస్తున్న ‘క్రేజీ కల్యాణం’ మూవీ నుంచి మేయర్ పోస్టర్ రిలీజ్ చేవారు. ఇందులో అనుపమా పెళ్లికూతురి గెటప్‌లో ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తూ కనిపించారు. ఈ మూవీలో అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి, నరేష్ వీకే, ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అనుపమ బర్త్ డే సందర్భంగా ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ‘క్రేజీ కల్యాణం’ మేకర్స్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఆమె ఈ చిత్రంలో కీర్తి అనే క్యారెక్టర్‌లో ప్రేక్షకులను అలరించనుంది. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్ టైన్‌మెంట్‌తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ఈ మూవీ చిత్రీకరించినట్లు సమాచారం.**

**—అక్షరటుడే, సినిమా డెస్క్**

## ఈవీ సెగ్మెంట్‌లోకి మారుతి ఎంట్రీ..

**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** మారుతి సుజుకీ ఇండియా తన తొలి బ్యాటరీ విద్యుత్ వాహనం ఈ-విటారాను విడుదల చేసింది. బ్యాటరీ యూజ్ ఎ సర్వీస్ (బాస్) పథకం కింద దీనిని రూ.10.99 లక్షలకు అందించబోతోంది. ఈ ధరలో బ్యాటరీ ఖర్చు ఉండదు. కస్టమర్లు బ్యాటరీని అద్దెకు తీసుకుని కిలోమీటరుకు రూ.3.99 చెల్లించాలి. 61, 49 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌లతో ఈ-విటారాలు లభ్యమవుతాయి. 49 కిలోవాట్ బ్యాటరీ 440 కిలోమీటర్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ 543 కిలోమీటర్ల మైలేజీ ఇస్తాయని కంపెనీ తెలిపింది. ఫాస్ట్ ఛార్జర్ ద్వారా 45 నిమిషాల్లో 80 శాతం ఛార్జ్ అవుతుందని పేర్కొంది. ఇంటి వద్ద ఛార్జింగ్ కోసం 7.4 కిలోవాట్ ఏసీ వాల్ బాక్స్ హోం ఛార్జర్‌తో పాటు రూ.50వేల విలువైన ఇన్‌స్టలేషన్ ప్రక్రియ ఉచితమని తెలిపింది.

